ముగిసిన పదో తరగతి పరీక్షలు

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ముగిశాయి. మంగళవారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాయి. ఈ పరీక్షకు 1,112 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 951 మంది హాజరవగా, 161 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో 85.52 శాతం హాజరయ్యారు.



గౌడవెల్లిలో పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

దాదాపు రెండు నెలల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. తమ పిల్లలను బడులకు తోలేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పుస్తకాలు, నోట్ బుక్కులు, ఇతర స్టేషనరీ వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఈ సారీ పరిష్కారం కాలేదు. ఉపాధ్యాయుల కొరత, శిథిలావస్థకు చేరిన భవనాలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తి కాలేదు. సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలకనున్నాయి. ఏదేమైనా నూతన విద్యా సంవత్సర ఆరంభాన్ని విద్యార్థులు సంతోషంగా మొదలుపెట్టేందుకు సంసిద్ధమయ్యారు.

సెలవులకు టాటా..
ఇక చదువు బాట!

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- సమస్యలతోనే సర్కారు బడులకు స్వాగతం
- అసంపూర్తిగానే అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు
- సమస్యల మధ్య విద్యాసంవత్సరం ఆరంభం

రంగారెడ్డి అర్బన్, జూన్ 11 : ఇక వేసవి సెలవులు ముగిశాయి. నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. బడికి వెళ్లేందుకు పిల్లలు సిద్ధమయ్యారు. రంగారెడ్డి జిల్లాలో 881 ప్రాథమిక పాఠశాలల్లో 62,730 విద్యార్థులు, 180 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 19,257 మంది విద్యార్థులు.. 284 ఉన్నత పాఠశాలల్లో 68,159 మంది విద్యార్థులు ఉన్నారు. గత విద్యా సంవత్సరం నుంచి 1 నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. కానీ ఉపాధ్యాయుల కొరత కారణంగా మెరుగైన విద్య అందటం లేదు. విద్యార్థులున్న చోట టీచర్లు లేరు. టీచర్లున్న చోట విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంది. ఈ రెండూ ఉన్న బడుల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. పాత సమస్యలతోనే బుధవారం తిరిగి బడులు తెరుచుకోనున్నాయి.

ఇంకా పాఠశాలలకు చేరుకోని పుస్తకాలు

అయితే ఇప్పటి వరకు పుస్తకాలు, దుస్తులు పాఠశాలలకు చేరుకోలేదు. యూనిఫామ్‌ల విషయానికొస్తే ఇంకా కుట్టుడు పూర్తి కాలేదు. జిల్లాకు 5.9కోట్ల ఖర్చుతో 1,47,642 విద్యార్థులకు అందించేందుకు 13,44,080 పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం 74.43శాతం పుస్తకాలను జిల్లా గోదాం నుంచి సరఫరా చేస్తున్నారు. వీటితో పాటు 7,63,329 ఉచిత నోట్ పుస్తకాలను మంజూరు చేశారు. ఇందులో 6, 7వ తరగతులకు ప్రతీ విద్యార్థికి ఆరు నోట్ పుస్తకాల చొప్పున, 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు 14 చొప్పున నోట్‌పుస్తకాలను ఇస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మొదటి విడతలో 423 పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరమ్మతులు చేపడుతున్నారు. అయితే పాఠశాలల పునఃప్రారంభం నాటికే పనులు పూర్తిచేయాలనే ఆదేశాలున్నా చాలా స్కూళ్లల్లో ఇంకా పనులు పూర్తి కాలేదు.

సమస్యల లోగిళ్లు..

చేవెళ్ల మండలం దేవరాంపల్లి పాఠశాల శిథిలావస్థకు చేరింది. రెండేళ్లుగా పిల్లలను పంచాయతీ కార్యాలయంలో కూర్చోబెట్టి చదువు చెబుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో మీటింగ్ ఉంటే ఆ రోజు పిల్లలకు చెట్ల కింద పాఠాలు చెబుతున్నారు. ఈ విషయమైన జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ దృష్టికి తీసుకు వచ్చారు. కడ్తాల కేజీబీవీ అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇలా జిల్లాలోని అనేక పాఠశాలలో సమస్యలు దర్శనమిస్తున్నాయి.

పారిశుధ్య కార్మికులు లేరు

పాఠశాలలు పునఃప్రారంభవుతున్న తరుణంలో పాఠశాలల్లో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్ల నుంచి ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించలేదు. ప్రభుత్వం మాత్రం పంచాయతీ, మున్సిపాలిటీ కార్మికులు వారి పరిధిలోని పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. వారు పాఠశాల ప్రారంభ సమయాల్లోనే పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఇక ఆతర్వాత వారు పట్టించుకోవడం లేదు. ఇక పాఠశాలల్లో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి.

స్కూళ్లలో పరిశుభ్రత పనులు

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): 55రోజుల తరువాత ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నేడు తెరుచుకోనున్నాయి. వేసవి సెలవులు మంగళవారంతో ముగిశాచి. విద్యాశాఖ అధికారులు మంగళవారం స్కూళ్లను శుభ్రం చేయించారు. ఇప్పటికే విద్యార్థుల పుస్తకాలు పాఠశాలలకు చేరుకున్నాయి. విద్యాశాఖ అధికారులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు పంపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పుస్తకాలు, బ్యాగులు, టిఫిన్ బాక్సుల కొనుగోళ్లకు బుక్‌స్టాళ్లకు వెళ్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు, 10 ఎయిడెట్ పాఠశాలలు మొత్తం 515 పాఠశాలలున్నాయి.

శిథిలావస్థలో పెద్ద తండా పాఠశాల

మర్పల్లి: మండలంలోని నర్సాపూర్ పెద్ద తండా పాఠశాల శిథిలావస్థకు చేరింది. ఏళ్ల నాటి ఈ భవనం వానకు ఉరుస్తోంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇక్కడ ఐదో తరగతి వరకు 30 మంది విద్యార్థులు ఉన్నారు. స్కూలు భవనానికి ఏటా నామమాత్ర మరమ్మతులు చేయిస్తున్నారు. వర్షం వస్తే గదుల్లో నీరు నిండుతుంది. సరైన వసుపాయం లేక తల్లిదండ్రులు తమ పిల్లలను పట్లూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. అలాగే ఈ పాఠశాలలో టీచర్లను భర్తీ చేయలేదు. నవాబుపేట మండలం నుంచి ఓ ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై నియమించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాఠశాల సమస్యలు తీర్చాలని తండా వాసులు కోరుతున్నారు.



శిథిలావస్థలో నర్సాపూర్ పెద్ద తండా పాఠశాల

మండల కేంద్రాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు

వికారాబాద్(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేసేలా జిల్లా విద్యా శాఖ చర్యలు చేపట్టింది. కాగా బడుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 1,063 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా, వాటిలో 776 ప్రాథమిక, 111 ప్రాథమికోన్నత, 176 ప్రభుత్వ, జడ్పీ పాఠశాలలున్నాయి. 9 ఎయిడెడ్, 18 కేజీబీవీ, 9 మోడల్ విద్యాలయాలు, 8బీసీ, 10గిరిజన, 8సాంఘిక సంక్షేమ, 6మైనార్టీ, 2 ప్రభుత్వ గురుకుల పాఠశాలలున్నాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమానికి 371 పాఠశాలను ఎంపిక చేశారు. రూ.23కోట్లతో 45 పాఠశాలల్లో సదుపాయాలు కల్పించి మమ అనిపించారు. కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద 1,064పాఠశాలల్లో విద్యుద్దీకరణ, మరుగుదొడ్ల పనులు, తాగునీటి సదుపాయం వంటి పనులు చేపట్టగా, 600 పాఠశాలల్లో పనులు పూర్తిచేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో పాఠశాలల్లో 83,462 మంది విద్యార్థులు చదువుతున్నారు. 3923 మంది ఉపాధ్యాయులు, 52 మంది పీఈటీలు పనిచేస్తున్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు

జిల్లాకు 5,27,030 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా 5,18,000 పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. వాటిని పాఠశాలలకు తరలిస్తున్నారు. అలాగే 4,60,422 నోట్ పుస్తకాలను సరఫరా చేశారు. స్కూళ్ల తెరిచే నాటికి పాఠశాలల్లో పాఠ్య, నోట్‌పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

యూనిఫాంలు రెడీ!

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 85,988 జతల యూనిఫాం సిద్ధం చేయాల్సి ఉండగా, ఈనెల 10వ తేదీ నాటిని 76,408 జతలు పాఠశాలలకు చేర్చారు. ఒక్కో విద్యార్థికి రెండు జతలు అందజేస్తారు. కాగా బడిబాట కార్యక్రమంలో 237 మంది బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

జిల్లాలో 4,648 మంది ఉపాధ్యాయులకు గాను 3,912 మంది పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఈనెలాఖరు వరకు కొనసాగనుంది. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పదో తరగతి పరీక్ష ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. రెండేళ్లుగా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా చివరి స్థానంలో నిలిచింది.

రేషన్‌కార్డు దరఖాస్తు దారులలో
చిగురిస్తున్న ఆశలు!

- సన్న బియ్యం పంపిణీతో లబ్ధిదారుల్లో సంతోషం..



మేడ్చల్ జూన్ 11(ఆంధ్రజ్యోతి) : త్వరలో రేషన్ కార్డులు మంజూరు చేస్తామని ... ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ సమావేశంలో విధివిధానాలు రూపొందించినట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలుపడంతో రేషన్‌కార్డు దారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలో రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని కూడా తెలుపడంతో లబ్ధిదారుల్లో సంతోషం వ్యక్తమౌతున్నది. వరుస ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉన్నందున దరఖాస్తు చేసుకున్న అర్హులకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ఎన్నికలు ముగిసి కోడ్ కూడా ఎత్తివేయడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి త్వరలో నూతనరేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో ఆశావాహుల ఎదురుచూపులకు తెరపడనుందని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలంటే ఆహారభద్రత కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. సుదీర్ఘ కాలంగా నూతన కార్డుల జారీ లేకపోవడంతో ఎందరో అర్హులు పథకాలకు దూరమౌతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలకు రేషన్ కార్డులనే ప్రామాణికంగా తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో నిరుపేదలకు కార్డులేని కారణంగా ఇబ్బందులు ఎదురౌతున్నాయనే వాదన బలంగా వినిపిస్తుంది. పథకాలు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తెల్ల రేషన్ కార్డు నిబంధన తప్పనిసరి కావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గత ప్రభుత్వ హయంలో కేవలం ఒక్కసారి మాత్రమే కొత్త రేషన్‌కార్డులు జారీ చేశారు. ఆ తర్వాత 2024 నుంచి కొత్తవి జారీ లేకపోవడంతో వేలాది మంది పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో ఆహారభద్రత కార్డుల ప్రక్రియ చేపడ్తామని ప్రకటించినప్పటికీ సుమారు రెండు నెలలకుపైగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మరింత జాప్య జరిగిందనే చెప్పవచ్చు. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2014లో అప్పటి ప్రభుత్వం ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి దాని ప్రకారం ఒకసారి రేషన్ కార్డులు, పింఛన్లు జారీ చేశారు. ఆ తర్వాత కొత్తవాటి జోలికి వెళ్లలేదు. 2022 ఆగస్టులో కొందరికి మాత్రమే కార్డులు పంపిణీ చేశారు. ప్రస్తుతం చాలా కుటుంబాల్లో సోదరులు విడిపోయి వేరే కాపురాలు పెట్టడం, తల్లిదండ్రులతో కాకుండా వేరుగా ఉండటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. కానీ కొందరు పురుషుల పేర్లు తల్లిదండ్రుల కార్డుల్లోనే ఉండటం, వారి భార్యా పిల్లల పేర్లు పొందుపరిచే అవకాశం కల్పించలేదు. దీనితో ఆ కుటుంబాలకు పథకాలు అందడం లేదు. దీనికి తోడు కార్డుల్లో మార్పులకు వెసులుబాటు కల్పించకపోవడంతో వేలాది మంది పేదలు స్థానికంగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. తాజాగా మంత్రి ప్రకటనతో సదరు దరఖాస్తులకు మోక్షం కలిగ అవకాశం ఉందని ఆశిస్తున్నారు. తక్షణమే సంబంధిత దరఖాస్తులపై అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అర్హులకు త్వరగా కార్డులు అందించాలని కోరుతున్నారు.

అంకితభావంతో పని చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 11 : ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కేజీబీవీ వసతి గృహాలు, గురుకులాల నిర్వహణపై సంక్షేమ అధికారులు, గురుకులాల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ ప్రత్యేక అధికారులచే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనము పొందుతున్న జీతానికి న్యాయం చేస్తున్నామా? పని చేయకపోవడం వల్ల ఈ పిల్లల భవిష్యత్తు ఏంటి అనే కోణంలో ఆలోచించి పనిచేయాలని అధికారులకు హితవుపలికారు. వసతి గృహాల్లోని విద్యార్థుల ఉత్తీర్ణత ఈ దఫా 70 శాతానికి తగ్గకుండా పని చేయాలని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా పోటీ పడాలని అన్నారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాలలల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు విలువ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ సిబ్బంది సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

తల్లిదండ్రుల పాత్ర పోషించాలి

దారిద్ర్యరేఖకు దిగువనున్న ఉన్న గ్రామీణ, మధ్య తరగతికి చెందిన అత్యంత పేద కుటుంబాల పిల్లలు వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తారని, తల్లిదండ్రుల పాత్రను పోషిస్తూ వారి బాగోగులను చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత అధికారులదేనని కలెక్టర్ అన్నారు. వసతి గృహాల్లో సబ్జెక్టుల వారీగా ట్యూటర్లను నియామకం చేసుకొని రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి ఉపేందర్, టిజీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్ రీజినల్ కోఆర్డినేటర్ శారద వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వాన

మోస్తరు నుంచి భారీ వర్షం

ఘట్‌కేసర్/వికారాబాద్, జూన్ 11 : ఘట్‌కేసర్‌లో రెండు రోజులుగా భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీ, చౌదరిగూడ గ్రామపంచాయతీతోపాటు మండల వ్యాప్తంగా వాన దంచి కొట్టింది. చెరువులు, కుంటల్లో అడుగుమేర నీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతోపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వీయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చినుకులతో ప్రారంభమైన వర్షం భారీ కురిసింది ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షంతో అక్కడక్కడ చెట్ల కొమ్మలు నెలకొరిగాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే విత్తనాలు విత్తుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

సుద్దపై గద్దల్లా..!

మారేపల్లిలో యథేచ్ఛగా సుద్ద అక్రమ తవ్వకాలు



మారేపల్లిలో అక్రమంగా అసైన్డ్ భూమిలో సుద్ద తవ్వకాలు

- పదివేల టన్నులకుపైగా తవ్వి పేరున్న కంపెనీ స్థలంలో నిల్వ
- అక్రమ సుద్దకు లీజుదారుల రాయల్టీలతో సక్రమం చేసే యత్నాలు
- జీవనోపాధికి వచ్చిన యువకులకు టోకరా వేసి గద్దల్లా వాలిన సుద్ద మాఫియా
- అక్రమ తవ్వకాలపై కన్నెత్తి చూడని అధికారులు
- రాజకీయ ప్రమేయంపై అనుమానాలు

తాండూరు, జూన్ 11: మారేపల్లి శివారులో సుద్ద అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పగలూరాత్రి తేడా లేకుండా యంత్రాల సహాయంతో తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమంగా తవ్విన సుద్దను సక్రమంగా మార్చేందుకు ఓ పేరున్న కంపెనీ స్థలంలో నిల్వలు చేశారు. గనులకు లీజులు పొందిన వారి నుంచి రాయల్టీలు తీసుకుని అక్రమంగా తవ్విన సుద్దను సక్రమంగా మార్చే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపితే పెద్దఎత్తున అక్రమ సుద్ద నిల్వలు బయటపడేందుకు అవకాశాలున్నాయి. పెద్దేముల్ మండలం మారెపల్లి సమీపంలో సుద్ద నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. అయితే ఇక్కడ అసైన్డ్‌భూములు, ఇనామ్ భూములను టార్గెట్‌గా చేసుకుని సుద్ద మాఫియా అక్రమ తవ్వకాలకు తెరలేపింది. స్థానికులు ఎవరూ అడ్డు రాకుండా వారికి ఉన్న పలుకుబడితో అందరి నోళ్లు మూయిస్తున్నారు. ఇక వారికి అడ్డూఅదుపు లేకపోవడంతో అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. మారేపల్లి గ్రామసమీపంలోనే ఒక ఇనామ్ భూమిలో సుద్దమాఫియా వారం రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా సుద్దఅక్రమ తవ్వకాలు జరుపుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి కొడుతున్నారు. అయితే అసైన్డ్ భూమిలో మొదట సుద్ద తవ్వకాలు చేసేందుకు కొంత మంది నిరుద్యోగ యువకులు వారి జీవనోపాధి కోసం ప్రజాప్రతినిధుల ద్వారా ప్రయత్నం చేశారు. కానీ వారి ప్రయత్నాలను అక్కడి స్థానికులు, సుద్ద మాఫియా అడ్డుకున్నారు. సుద్ద తవ్వకాలు జరపకుండా అటంకాలు కల్పించడంతో విసిగిపోయేలా చేశారు. ఆ యువకులు పెట్టిన పెట్టుబడిని వదులుకునేలా ముప్పతిప్పలు పెట్టారు. సుద్ద తవ్వకాల కోసం అప్పులు చేసి తెచ్చిపెట్టిన డబ్బులు కూడా వారికి రాకుండా చేశారు. ఇక సుద్ద మాఫియా రంగంలోకి దిగి అక్రమ తవ్వకాల తెరలేపారు. రాత్రి, పగటూ అనే తేడా లేకుండా యథేచ్ఛగా సుమారు 10 వేల క్వింటాళ్ల వరకు సుద్ద తవ్వకాలు చేపట్టారు. అక్రమంగా తవ్విన సుద్దను విదేశాలకు ఎగుమతి చేసే ఓ పేరున్న కంపెనీ స్థలంలో నిల్వ చేశారు అక్రమార్కులు. తవ్వకాలు అక్రమమైనప్పటికీ నిల్వ పెట్టడం కూడా అక్రమమే. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విచారణ జరిపితే పెద్ద ఎత్తున అక్రమ సుద్ద నిల్వలు బయట పడే అవకాశాలున్నాయి.. ఇప్పటికీ సుద్ద గనులు తవ్వుకునేందుకు కొందరు వ్యాపారులు లీగల్‌గా దరఖాస్తులు చేసుకుని అనుమతుల కోసం ఎదురు చూస్తుంటే, మరోపక్క అక్రమార్కులు అడ్డదారిలో అక్రమంగా తవ్వకాలు చేపట్టి ఇతర గనుల రాయల్టీలతో సక్రమంగా చేసి విదేశాలకు సుద్దను ఎగుమతి చేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం భారీగా సుద్ద మాఫియా కొల్లగొడుతోంది.



తవ్వకాలు జరిపిన సుద్దను ఓ లిమిటెడ్ కంపెనీ స్థలంలో నిల్వ



జేసీబీతో సుద్ద తవ్వకాలు చేపట్టి లారీలో లోడింగ్

ప్రభుత్వాస్పత్రి ఎదుట నర్సుల నిరసన



ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన నిర్వహిస్తున్న నర్సులు

ఘట్‌కేసర్, జూన్ 11: వైద్య సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి నర్సులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న నర్సింగ్ అధికారులు, నర్సులకు వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని, సాధారణ బదిలీలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవోనెంబర్ 317ద్వారా వైద్య ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరించాలన్నారు. కొత్తగా రిక్రూట్ అయిన నర్సింగ్ సిబ్బందికి రావా ల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నర్సింగ్ క్యాడర్ కోసం జేడీ, వీడీ పోస్టులను ఏర్పాటు చేసి నర్సింగ్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ అటానమస్‌ను రద్దుచేసి వైద్య ఆరోగ్యశా ఖలో విలీనం చేయాలన్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లోని 1999బ్యాచ్ నుంచి పెండింగ్‌లో అందరికీ ప్రమోషన్స్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కబ్జాకు గురైన భూమి స్వాధీనం



రెవెన్యూ స్థలంగా బోర్డు పెడుతున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు, జూన్ 11: విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన గల ప్లేగ్రౌండ్ ప్రభుత్వ భూమిగా నిర్ధారించి తహసీల్దార్ తారాసింగ్, రెవెన్యూ సిబ్బంది దగ్గర ఉండి ప్రభుత్వ భూమిగా మంగళవారం బోర్డు పాతించారు. అంతకుముందు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసిన రెవెన్యూ సిబ్బందిని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారా? బోర్డు పాటించారా అంటూ ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి కథనంపై ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

ఎన్‌వోసీకి దరఖాస్తు చేసుకున్న భూమి పరిశీలన



వ్యవసాయేతర భూమిని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

తాండూరు రూరల్, జూన్ 11 : తాండూరు పట్టణ శివారులోని పాత తాండూరు రోడ్డు మార్గంలో విజయస్టోన్ పాలిషింగ్ కంపెనీ సమీపంలో 181 సర్వేనెంబర్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సర్వేనెంబర్‌లో తొమ్మిది ఎకరాల భూమిని మాణిక్ రావు కుమారుడు ఎం.రమేష్ ఇటీవల వెంచర్ ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అట్టి భూమిని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి వచ్చి పరిశీలించారు. శ్మశాన వాటిక, ఆలయం వంటివి ఏమైనా ఉన్నాయా? అనే విషయాలను ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సర్వేనెంబర్-181లో ఎన్ని ఎకరాల భూమి ఉంది, అందులో వ్యవసాయేతర భూమికి ఎన్ని ఎకరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు, పారిశ్రామిక భూమినా, వ్యవసాయేతర భూమినా? అని సమగ్ర వివరాలను సేకరించారు. ఈ నివేదికను పరిశీలించి కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయన వెంట దరఖాస్తు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు మల్కాడ్ రమేష్, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐలు బాల్ రాజ్, రాజురెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వాలి : ఎంపీడీవో

కొందుర్గు, జూన్, 11: తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువును ఆస్తిగా ఇవ్వాలని ఎంపీడీవో డాక్టర్ అంజనేయలు అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతికి వివిధ గురుకుల పాఠశాలలకు ఎంపికైన 21మంది విద్యార్థులు మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ మాట్లాడుతూ దళితవాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మూసివేత నుంచి తిరిగి పూర్వవైభవ స్థితికి చేరుకుందన్నారు. పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థిని జిల్కెళ్ల నిఖిత 376 మార్కులతో నీట్‌లో ప్రతిభ చాటడంతో పలువురు అభినందించారు. షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ రెడ్యానాయక్ విద్యార్థులకు బిస్కెట్స్, విటమిన్ పౌడర్ ప్యాకెట్స్, చాక్లెట్స్ అందజేశారు. దాతలను శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు. ఎంపీటీసీ ఇస్తారమ్మ మాణెయ్య, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ భారతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జోన్‌లో సంగారెడ్డి సర్కిల్



- పాలన సౌలభ్యం కోసం విద్యుత్‌శాఖ మార్పులు
- జూలై 1 నుంచి మేడ్చల్ జోన్ నుంచి సంగారెడ్డి ఆపరేషన్స్
- ఉత్తర్వులు జారీ చేసిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చుట్టూ శివారు ప్రాంతాల్లో వేగంగా విస్తరించడం.. భారీగా విద్యుత్ డిమాండ్ పెరగడం, లక్షల సంఖ్యలో కొత్త విద్యుత్ కనెక్షన్లు వస్తుండడంతో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పాలనా సౌలభ్యం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మేడ్చల్ రూరల్ జోన్ పరిధిలోని సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌ను మేడ్చల్ జోన్‌లో కలుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. జూలై 1 నుంచి సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్ నిర్వహణ మేడ్చల్ జోన్ పరిధిలోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి సర్కిల్ మేడ్చల్ జోన్‌లోకి తీసుకురావడంతో ఈ జోన్‌లో సర్కిళ్ల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లు మేడ్చల్ జోన్ పరిధిలో ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లు ఉన్నాయి. మెట్రోజోన్ పరిధిలో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్ ఆపరేషన్ సర్కిళ్లు పనిచేస్తున్నాయి. రంగారెడ్డి జోన్‌లో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లు, మేడ్చల్ జోన్‌లో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉండగా కొత్తగా సంగారెడ్డి సర్కిల్‌ను కలిపారు. సంగారెడ్డి సర్కిల్‌లో పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా మొత్తం 7.91 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఏరియాతో పాటు ఎక్కువ అపార్ట్‌మెంట్లు, కొత్తకాలనీలు ఏర్పాటవుతుండటంతో విద్యుత్‌శాఖ ఈ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు, నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తుంది. బీరంగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, బొల్లారం, పటాన్‌చెరు వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ రికార్డుస్థాయిలో పెరుగుతోంది. నగరంలో ఎలాంటి విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉందో అదేతరహాలో శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్కిళ్లను విద్యుత్‌శాఖ విస్తరిస్తోంది.

మేడ్చల్ జోన్‌లో సర్కిళ్లు, విద్యుత్ కనెక్షన్లు

సర్కిల్	విద్యుత్‌కనెక్షన్లు
హబ్సిగూడ	8,95,038
మేడ్చల్	8,44,514
సంగారెడ్డి	7,91,364
మొత్తం	25,30,916

స్కూల్‌కు వెళ్దాం.. చలో..!



- కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానం
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- తొలిరోజే యూనిఫాం, పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు
- ఈ యేడాది వసతులపై ప్రత్యేకశ్రద్ధ
- సర్కారు బడిలో చేర్పించాలని ప్రచారం

తాండూరు, జూన్ 11: కాంగ్రెస్ సర్కార్ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ఈ ఏడాది పలు మార్పులు చేపట్టింది. వసతుల కల్పనతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించింది. 2024-25 విద్యా సంవత్సర క్యాలెండర్‌లో ఇది వరకే విద్యాశాఖ ప్రకటించింది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో మార్పు తెస్తూ కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానాన్ని తేస్తు కొత్త ఆలోచనలతో కొత్త విద్యా విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా విద్యాభివృద్ధికి మహిళా సంఘాలకు భాగస్వామ్యం కల్పించారు. పండుగ వాతావరణంలో పాఠశాలలను రీ ఓపెన్ చేయాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పాఠశాలలో విద్యలో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం మంచి వాతావరణాన్ని కల్పించింది. దీంతో ఉపాధ్యాయులు ఉత్సాహంగా విద్యాబోధన చేసేందుకు సిద్ధమయ్యారు.

గతానికి భిన్నంగా కమిటీలు

పాఠశాలలో రాజకీయాలు ఉండకుండదనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది ప్రభుత్వం సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. విద్యా కమిటీల స్థానంలో మహిళా సంఘాలకు భాగస్వామ్యాన్ని కల్పించింది. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా ఉండే ఈకమిటీలో స్థానిక మహిళా సంఘం అధ్యక్షురాళ్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులుగా నామినేట్ చేశారు. రూ.25వేల వరకు పనులన్నింటినీ ఈ కమిటీకే అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, వసతుల కల్పన బాధ్యత ఈ కమిటీలకే అప్పగించారు. ఈ కమిటీలో పర్యవేక్షణ బాధ్యత పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, గ్రామాలలో ఎంపీడీవోలకు అప్పగించారు. స్కూల్ డ్రెస్ స్టిచింగ్ బాధ్యత ఈ సారి మహిళా సంఘాలకు ఇచ్చారు. ఈ ఏడాది పాఠశాల పునఃప్రారంభానికి ముందే బడిబాటను మహిళా సంఘాల సహకారంతో చేపట్టారు.

తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనీఫాంల పంపిణీ

తొలిరోజే విద్యార్థులందరికీ రెండు జతల యూనీఫాంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందించేందుకు సిద్ధం చేశారు. అక్షరా భాష్యం కార్యక్రమంలో చిన్నారులకు ఉచితంగా దాతల ద్వారా పలకలు, బలపాలు అందించాలని విద్యాశాఖ ఆదేశాలున్నాయి. అవసరమైన చోట కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులను నియమించుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. యూనీఫాంలు ఇప్పటికే స్కూళ్లకు చేరాయి.

బడి వేళల్లో మార్పు

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9గంటలకే ప్రారంభించాలి. ఉన్నత పాఠశాలలు మాత్రం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.45గంటల వరకు కొనసాగుతాయి. ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మార్పులుండవు. యథావిధిగా కొనసాగుతాయి. అదేవిధంగా ఈ సారి పాఠశాలల్లో రోజూ 90శాతానికి పైగా విద్యార్థుల హాజరుండాలి. విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం బోధన జరగాలి. 6, 7తరగతుల గణితం సబ్జెక్టును ఇక నుంచి భౌతికశాస్త్రం ఉపాధ్యాయులే బోధించాలి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ వంటి అన్ని పాఠశాలల్లో రోజూ 90శాతానికి పైగా విద్యార్థులు హాజరు కావాల్సిందే.

ప్రతీనెల 'నో బ్యాగ్ డే'

ఈ సారి ప్రతి నెల 4వ శనివారం నో బ్యాగ్ డేను అమలు చేయాలి. రోజూ 30 నిమిషాల పాటు పాఠ్యపుస్తకాలు, కథల పుస్తకాలు, దిన పత్రికలు, మేగజైన్లు చదివించాలి. టీవీ పాఠాలను యథావిధిగా ప్రసారం చేయాలి. విద్యార్థులతో ఐదు నిమిషాలు యోగా, ధ్యానం చేయించాలి. జనవరి 10వ తేదీ నాటికి పదోతరగతి సిలబస్ పూర్తిచేయాలి.

పండుగ వాతావరణంలో రీ ఓపెన్ చేయాలి

ఈనెల 12వ తేదీన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను పండుగ వాతావరణంలో రీఓపెన్ చేయాలని, ఇందుకు ఏఏపీసీ కమిటీ సహకారం తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది. పాఠశాలను తోరణాలతో అలంకరించాలని, ముగ్గులు వేయించాలని సూచించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు.

వసతుల కల్పనపై దృష్టి

ఈ యేడాది పాఠశాలలు తెరవకముందే వసతుల కల్పనకు నిధులు ఇచ్చింది. రూ.25వేల వరకు కమిటీలే పనులు చేసేందుకు అధికారమిచ్చింది. మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుత్ పనులు, మంచి నీటి వసతి కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, జూన్ 11 : తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించకుండా అధికారులందరూ పనుల్లో వేగాన్ని పెంచాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా, పైపులైన్ల లీకేజీలు వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు మున్సిపాలిటీలో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పరిసరాల పరిశుభ్రత వంటి పనుల్లో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న సందర్భంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రామ్, కౌన్సిలర్లు రవినాయక్, లావణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

కడ్తాల్, జూన్ 11 కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలును హర్షిస్తూ కడ్తాల మండలం ముద్విన్‌లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్సీ , పార్లమెంట్ ఎన్నికల కోడ్ మూలంగా ఈ పథకం అమలు కాలేదు. కోడ్ ముగియడంతో ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకం అమలు కు శ్రీకారం చుట్టారు. స్థానిక మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మధు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ జెండాలు చేబూని ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు ఈర్లపల్లి యాదయ్య, నక్కపోతు నర్సింహ, రేవంత్ మిత్ర మండలి అధ్యక్షుడు గంట నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కడా పనుల్లో పురోగతి సాధించాలి

వికారాబాద్, జూన్11: కొడంగల్ నియోజకవర్గంలో కడా కింద చేపట్టాల్సిన పనుల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లఓని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. కొడంగల్ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి , తదితర అభివృద్ధి పనులు మొదలుపెట్టాలన్నారు. ఇరిగేషన్ శాఖ ద్వారా కొడంగల్ నియోజకవర్గానికి అవసరమైన సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో పనిచేసే అధికారులందరూ పూర్తి బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు

కల్తీ విత్తనాల అంతు చూడండి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11: అన్నదాతను నట్టేటముంచే కల్తీ విత్తనాల అంతు చూడడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ ఎల్ఎన్ గార్డెన్‌లో మంగళవారం విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులపై డీలర్లు, రైతులకు అవగాహన నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడారు. కల్తీ, నాణ్యత ప్రమాణాలు లేని విత్తనాలను సాగుచేస్తే దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోతారని గుర్తుచేశారు. డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన నాణ్యమైన, మేలురకమైన విత్తనాలను మాత్రమే వ్యాపారులు విక్రయించాలని సూచించారు. షాద్‌నగర్ ఏడీఏ రాజరత్నం మాట్లాడుతూ వానకాలం పంటల సాగు కోసం అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు తొందరపడి అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని కోరారు. షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, సీఐలు కె.ప్రతాపలింగం, సత్యనారాయణ, ప్రసాద్, నర్సింహారావు, మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, వై.యాదయ్యయాదవ్, తదితరులున్నారు.

నా భూమి నాకే చెందాలి

- తనకు అమ్మిన తర్వాత వేరొకరికి విక్రయించారని నిరసన దీక్షకు పూనుకున్న రైతు

షాద్‌నగర్ రూరల్, జూన్ 11: 35 ఏళ్ల క్రితం తనకు భూమి విక్రయించి.. ప్రస్తుతం అదే భూమిని వేరొకరికి విక్రయించారని, ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతూ ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామానికి చెందిన రైతు శివరాజ్ మంగళవారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నిరాహార దీక్షకు పూనుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శివరాజ్ తండ్రి పండుగ బాలయ్య 1988లో అదే గ్రామానికి చెందిన మంగలి రాంచంద్రయ్య మరో ముగ్గురి నుంచి సర్వేనెంబర్ 292లో 32 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ భూమిలో బాలయ్య.. అతడి మరణానంతరం ఆయన వారసులు సాగు చేస్తున్నారు. అయితే, అప్పటి నుంచి భూమి రిజిస్ట్రేషన్ చేయమని విక్రయించిన వారిని అడుగున్నా.. కాలయాపన చేస్తూ వచ్చారు. మొదట భూమి విక్రయించిన మంగలి రాంచంద్రయ్య మరో ముగ్గురు చనిపోవడంతో వాళ్ల వారసులు విరాసత్ చేయించుకున్నారు. ఇనాం భూమి కావడంతో ఓఆర్‌సీ తెచ్చుకుని ఇతరులకు విక్రయించారు. విషయం తెలుసుకున్న శివరాజ్ తనకు న్యాయం చేయాలని దీక్షకు కూర్చున్నాడు. గ్రామస్తులు మద్దతు తెలిపి ఆయనతో పాటు దీక్షలో కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ గిర్ధావర్‌ను పంపించి వివరాలు తెలుసుకున్నారు. వివరాలు కలెక్టర్‌కు పంపి న్యాయం జరిగే విదంగా చూస్తామని చెప్పారు. అయితే, తనకు న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని బాధితుడు తెలిపాడు.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

కడ్తాల్, జూన్ 11: ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రజా పాలన ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పాలనా సౌలభ్యం, ప్రజల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంగళవారం తహసీల్దార్ ముంతాజ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి కసిరెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణానికి రెండు విడతల కింద రూ.1.80 కోట్లు మంజూరయ్యాయని, నిధులు చాలకపోవడంతో కొంతమేర పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, మరో రూ.20 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ పరమేశ్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పనులకు చేసిన ఖర్చుకు మధ్య వ్యత్యాసం కన్పిస్తుందని ఎమ్మెల్యే ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని ఏఈ పరమేశ్‌ను ఆదేశించారు. బోరు నిర్మాణానికి తన నిధుల నుంచి డబ్బులు కేటాయిస్తానని తెలిపారు. మిగులు పనుల గూర్చి కలెక్టర్ తో మాట్లాడుతానని చెప్పారు. మండల కేంద్రం సమీపంలో రూ.3.35 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కేజీబీవీలో మిగులు పనులను వెంటనే పూర్తి చేయించి భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తెస్తామన్నారు. మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 11: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని ఆ శాఖ ఐఎన్‌టీయూసీ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరి జనరల్ ఎనుముల శ్రీధర్ తెలిపారు. షాద్‌నగర్‌లో మంగళవారం 327 యూనియన్ డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రీధర్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాద్‌నగర్ డివిజన్ యూనియన్ అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శిగా ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా రాందాస్, రమేష్, యాదగిరిలు ఎన్నికైనారు. డిస్కం అధ్యక్షుడు సురేష్‌కుమార్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' నిధులు విడుదల చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల, జూన్ 11 : రైతు భరోసా పథకం కింద రైతులకు అందించే నిధులను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేస్-2లో చేవెళ్ల పార్టీ మండల సహాయ కార్యదర్శి ఎండీ మక్బూల్ అధ్యక్షతన మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా పథకం కింద ఎకరానికి పదిహేను వేల రూపాయలను అందజేయాలని, ఆ నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఉన్న సర్వేనెంబర్ 75లో గత 16 నెలలుగా పేదలు గుడిసెలు వేసుకున్నారని, ప్రభుత్వం స్పందించి ఇళ్లలేని వారికి ఇంటి పట్టాలు అందించి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మండల మహిళా అధ్యక్షురాలు లలిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో చెట్లు నరికిన ప్రాంతంలో ప్లాంటేషన్

- గుంతలు తీయాలని డీఎఫ్‌వో ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



దోర్నాల్ అడవిలో తవ్వుతున్న గుంతలు

ధారూరు, జూన్ 11: ధారూరు ఫారెస్టు రేంజ్‌లోని దోర్నాల్ బీట్‌లో చెట్లు నరికి అటవీ ప్రాంతాన్ని ఆక్రమించుకునే ప్రయత్నాన్ని అటవీ అధికారులు మంగళవారం నిలువరించారు. 'దోర్నాల్ అడవిలో చెట్లు నరికివేత' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్ స్పందించారు. దోర్నాల్ అటవీ ప్రాంతంలో చెట్లు నరికిన ప్రాంతంలో మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాలని ఆయన రేంజ్ అటవీ అధికారులను ఆదేశించారు. దీంతో ఇన్‌చార్జి రేంజర్ అరుణ, ఎఫ్ఎస్‌వో మోయినోద్దీన్, బీట్ అధికారి అనందంలు చెట్లు నరికిన అటవీ ప్రాంతంలో మొక్కలు నాటేందుకు పనులను ప్రారంభించారు. ఇదే సమయంలో దోర్నాల్ తండాకు చెందిన కొంతమంది మహిళలు అక్కడికి వచ్చి పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. మహిళలు అటవీ అధికారులతో గొడవకు దిగడంతో రేంజర్ అరుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వేణుగోపాల్ గౌడ్, సిబ్బందితో అక్కడికి చేరుకుని గొడవ చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించేశారు. కాగా, ఇన్‌చార్జి రేంజర్ అరుణ తండావాసులతో మాట్లాడుతూ.. పోడు పట్టాలు ఇచ్చిన తర్వాత అటవీభూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు పట్టాల్లో ఉన్న విస్తీర్ణంలోనే సాగు చేసుకోవాలని కొత్తగా అడవిని నరికి ఆక్రమిస్తే ఇబ్బందులు తప్పవని సూచించారు. అనంతరం చెట్లు నరికిన ప్రాంతంలో మొక్కలు నాటేందుకు జేసీబీతో గుంతలు తవ్వించారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకుంటాం

ధారూరు రేంజ్ పరిధిలోని దోర్నాల్ బీట్‌లో చెట్లను నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అడవిలో దాదాపు నాలుగు ఎకరాలోట్ల చెట్లను నరికివేసినట్లు గుర్తించాం. అడవిలో చెట్లు నరికివేస్తున్నట్లు అందిన సమాచారంతో ఇన్‌చార్జి రేంజర్ అరుణ అక్కడికి వెళ్లగా చెట్లు నరికిన వ్యక్తులు అప్పటికే అక్కడి నుంచి పారిపోయారు. దీని పై సమగ్ర విచారణ జరిపి అడవిని ఆక్రమించి అక్రమ సాగుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ప్లాంటేషన్ చేయటానికి గుంతలు తీయిస్తున్నాం.

\- జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్

అరాచక శక్తులను ప్రభుత్వం ఊపేక్షించదు : ఎంపీ

కడ్తాల, జూన్ 11 : ఆరాచకాలు హింసను కాంగ్రెస్ ప్రభుత్వం ఊపేక్షించబోదని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని బట్టర్‌ఫ్లై సిటీలో ఈనెల 5న హత్యకు గురైన గోవిందాయపల్లికి చెందిన గుండెమోనిగారి శివగౌడ్. శేషగారి శివగౌడ్ కుటుంబాలను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఎంపీ పరామర్శించారు. జరిగిన ఘటనలపై బాధిత కుటుంబాలను, పోలీస్ అధికారులను అడిగితెలుసుకున్నారు. ఇద్దరు యువకులను హతమార్చడం బాధాకరమన్నారు. విచారణ జరిపి శిక్ష పడేలా చూడాలని పోలీసులను కోరారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌తో తాను మాట్లాడతానన్నారు. మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్కరికి రూ.10వేల మేర ఎమ్మెల్యే నారాయణరెడ్డి సాయమందించారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, రవికాంత్‌గౌడ్, వస్పుల జంగయ్య, బిక్యానాయక్, తదితరులున్నారు. ఇద్దరిని దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ డిమాండ్ చేశారు. గోవిందాయిపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను దశరథ్ పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్ నాయక్ ఆర్థిక సాయం అందించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా అందించాలని దశరథ్ కోరారు. కడ్తాల వైస్ ఎంపీపీ ఆనంద్ మృతుల కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు.

ఎంపీడీవో కార్యాలయంలో పాము కలకలం


కర్ర సాయంతో పామును బయటకు తీసుకెళ్తున్న కూలీ

బషీరాబాద్, జూన్ 11: బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఓ పాము కలకలం రేపింది. కార్యాలయంలోని ఓ గదిలో ఎన్నికల సామగ్రితో పాటు, నిల్వఉంచిన పలు రికార్డులను బయటకు తీయించి ఆఫీస్ సబార్డినెట్ శంకర్ కూలీలతో శుభ్రం చేయిస్తున్నాడు. ఈ క్రమంలో సామగ్రి, రికార్డుల దుమ్ము దులిపి కూలీలు లోపాలికి తీసుకెళ్తుండగా ఒక్కసారిగా పాము బయటకు వచ్చింది. వర్షాకాలం పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని, కార్యాలయ అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని జడ్పీటీసీతో పాటు, నాయకులు పలువురు సూచించారు.

పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

వికారాబాద్ , జూన్ 11: బెస్ట్‌అవైలేబుల్ పాఠశాలలో వున్న ఖాళీల ప్రవేశాలకు లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక చేసినట్లు అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం బెస్ట్‌అవైలేబుల్ పాఠశాలలలో 1వ తరగతి నాన్ రెసిడెన్షియల్, 5వ తరగతిలో రెసిడెన్షియల్ ప్రవేశాలకు జిల్లాకు మొత్తం 88 నాన్‌రెసిడెన్షియల్ ఖాళీలకు గానూ 135మంది విద్యార్థివిద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

విద్యాదాత పురస్కారం ప్రదానం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 11: ఎదులాబాద్‌కు చెందిన మెంగ అరవింద్‌కు వందేమాతరం విద్యాదాత పురస్కారం వరించింది. ఈ మేరకు నగరంలోని రవీంద్రభారతిలో మంగళవారం వందేమాతరం ఫౌండర్ జయప్రకాష్ నారాయణ, టీచర్స్ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి చేతుల మీదుగా అరవింద్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్తు కోసం కృషిచేసినందుకు ఆయనకు ఈ పురస్కారం దక్కింది.

లయన్స్‌క్లబ్ సేవలతో పేదలకు మేలు

కొడంగల్, జూన్ 11: సేవా దృక్పతంతో ఎంతో మందికి కంటి పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు వైద్యులు నైనా, సాకేత్, సూపరింటెండెంట్ చంద్రప్రియ, లయన్స్‌క్లబ్ సభ్యులు దానప్పయాదవ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. కంటి వైద్య శిబిరంలో 70మందికి పైగా పాల్గొనగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అందులో 30మందిని శస్త్రచికిత్సల కోసం రెఫర్ చేశారు. ఆసుపత్రి సిబ్బంది, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి, ఎరువుల వాడకంపై అవగాహన

పూడూరు, జూన్ 11: పూడూరు రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, రైతులు చింతల వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు రైతులకు పలు సూచనలు చేశారు.

సామాజిక సామరస్యానికి 'క్షేత్ర సంస్థ' దోహదం

శామీర్‌పేట, జూన్ 11: సామాజిక సామరస్యానికి నల్సార్, క్షేత్ర సంస్థలు సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడుతుందని నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ అన్నారు. నల్సార్ వైస్‌చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావ్ ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర ఫౌండేషన్ వారు-నల్సార్ విశ్వవిద్యాలయం సంస్థల వారు సంయుక్తంగా రూపొందించిన విద్యా సంబంధ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు అవగాహన ఒప్పందం చేసుకుని సంతకాలు చేశాయి.

వ్యవసాయేతర భూమికి 'రైతుబంధు'పై విచారణ

బషీరాబాద్, జూన్ 11: వ్యవసాయేతర భూమికి రైతుబంధు వస్తుందనే ఫిర్యాదుపై బషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ మంగళవారం గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు. మండలంలోని మంతట్టి గ్రామస్తులు కొందరు ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు ఇచ్చిన భూమికి రైతుబంధు వస్తుందని, రైతుపేరు ధరణిలోంచి తొలగించాలని సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తహసీల్దార్ వై.వెంకటేష్ ఆదేశానుసారం ఆర్‌ఐ గ్రామానికి చేరుకుని రైతుబంధు పంపిణీ జరుగుతున్న భూమిని స్వయంగా పరిశీలించారు. తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని ఆర్‌ఐ చెప్పారు.

ప్రభుత్వాసుపత్రి సేవలను వినియోగించుకోవాలి

కొడంగల్, జూన్ 11: కొడంగల్ ప్రభుత్వాసుపత్రిలో అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిచందన తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో అన్నీ వైద్య సేవలతో పాటు సాధారణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు షిఫ్టుల మేర 40మంది డయాలసిస్ రోగులు చికిత్సలు పొందుతున్నారని తెలిపారు.

గుండెపోటుతో మాజీ జడ్పీటీసీ మృతి

దౌల్తాబాద్: సీనియర్ నాయకులు, దౌల్తాబాద్ మాజీ జడ్పీటీసీ, ఎంపీపీ మోహన్‌రెడ్డి గుండె పోటుతో మృతి చెందారు. కుటుంబసభ్యులతో కలిసి అరకు యాత్రకు వెళ్లిన ఆయనకు సోమవారం రాత్రి గుండె పోటు రావడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు..

పరిగి, జూన్ 11: ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బి.రాజు(47) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. కొన్ని రోజుల నుంచి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాజు సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం ఆయన స్వగ్రామంలో ఖుదావంద్‌పూర్‌లో అత్యక్రియలు జరిగాయి.

క్రీడల్లో గెలుపోటములు సహజం


బషీరాబాద్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జూన్ 11: క్రీడల్లో గెలుపోటములు సహజమని గెలిచినా, ఓడినా ఎవరూ సహనాన్ని కోల్పోరాదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల బాలురు మైదానంలో మంగళవారం ఆసిఫ్ మెమోరియల్ సర్కిల్ క్రికెట్ టోర్నీలో విజేతలుగా నిలిచిన విన్నర్, రన్నర్ జట్లకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ క్రీడలతో శరీర దృఢత్వం, మానసిక ఉల్లాసం, స్నేహ సోదర భావాలు పెంపొందుతాయని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా క్రికెట్ టోర్నీ నిర్వహకులకు సొంతంగా రూ.25 వేల నగదును ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మిర్యాణం శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, మాజీ వైస్‌చైర్మన్ రామునాయక్, కాంగ్రెస్ జిల్లా పార్టీ కార్యదర్శి జి.మాధవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి, పార్టీ నాయకులు పి.శంకర్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఎం.నర్సిరెడ్డి, శంకరప్ప, భస్సీలాల్, ఆర్‌ఎంపీ నర్సింహ, రియాజ్, వడ్డె హన్మంతు, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తాండూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో మంగళవారం తాండూరు, పెద్దేముల్ మండలాలు తాండూరు పట్టణానికి చెందిన 237మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 37లక్షల 27వేల 492 విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తాండూరు ఎంపీపీ అనిత గౌడ్, పెద్దేముల్ జడ్పీటీసీ ధారాసింగ్, వైస్ ఎంపీపీ మధులత, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, నీరజ, విజయదేవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


బొంరాస్‌పేట్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట్, జూన్ 11: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రం బొంరాస్‌పేట్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పేదల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించే నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అని గుర్తు చేశారు. ఇక కొడంగల్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. 61 మంది లబ్ధిదారులకు రూ.61 లక్షల 976 చెక్కులు పంపిణీ చేశారు. బొంరాస్‌పేట్‌తో పాటు దుద్యాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ హేమీబాయి, డిప్యూటి తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో వెంకన్నగౌడ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు గౌడ్, ఆవుటి శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహులునాయుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ జాతర

కొడంగల్ రూరల్: కొలిచిన వారికి కొంగు బంగారంగా వెలుగొందుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక కార్యక్రమాలతో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులను ఆలయ కమిటీ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర


ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్, జూన్ 11: కర్ణాటక-తెలంగాణ సరిహద్దులోని కొత్లాపూర్ గ్రామ శివారులో గల శ్రీరేణుకా ఎల్లమ్మ జాతరోత్సవాలు నెలరోజుల పాటు కొనసాగనున్నాయి. అందులో భాగంగా నాల్గో మంగళవారం కావడంతో భక్తులు పోటెత్తారు. రథోత్సవం రోజు భారీవర్షం కురవడంతో అప్పట్లో పెద్దగా భక్తులు హాజరుకాలేదు. మంగళవారం పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. దర్శనానికి గంటపాటు క్యూలైన్‌లో నిలబడి దర్శనం చేసుకుంటున్నారు. మొక్కులు తీర్చేందుకు కొంతమంది మహిళా భక్తులు వేపచీర ధరించి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. మరి కొందరు భక్తులు డప్పువాయిద్యాలతో బోనాలతో ఊరేగింపుగా తరలివస్తున్నారు. ఈ జాతర ఉత్సవాలు మరో 15రోజులపాటు కొనసాగనున్నట్లు దేవాదాయ శాఖ ఈవో శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో అదే గ్రామానికి చెందిన పట్లోళ్ల నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డితో పాటు రేణుకా ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి తదితరులు అక్కడే ఉండి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తున్నారు.

ఏఈవోల సస్పెన్షన్‌పై నిరసన

బొంరాస్‌పేట్, జూన్ 11: మహబూబాబాద్ జిల్లాలో వ్యవసాయశాఖ ముగ్గురు ఏఈవోలను అకారణంగా సస్పెన్షన్ చేయడంతో మంగళవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర కొడంగల్ నియోజకవర్గంలోని ఏఈవోలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ అధికారి చేయాల్సిన పనులను డీలర్లతో ఆన్‌లైన్ చేయించడం, అందుకు ఏఈవోలను బాధ్యులను చేయడం సరైంది కాదన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని ఏఈవోలపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు ఐసాక్ హెరాల్డ్, మల్లేశ్, రాజు రాథోడ్, మొహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మోమిన్‌పేట్, జూన్ 11: మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె.నీతిక పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10/10 జీపీఏ మార్కులు సాధించడంతో సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా వందేమాతరం ప్రతిభా పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి విద్యార్థిని నీతికను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయుడు గోపాల్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

వికారాబాద్ , జూన్ 11:బ్యూటీ పార్లర్ మేనేజ్ మేంట్ కోర్సు ఉచిత శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు ఒక ప్రకటన తెలిపారు. జూన్ 13వ తేదీలోగా స్వర్ణ భారతి ట్రస్ట్, ముచ్చింతల్ , రంగారెడ్డి జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.ఇట్టి కోర్సును స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి సహకారంతో నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. కోర్సు 30 రోజులపాటు ఉదయం 9:30 నుండి 5:30 వరకు శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 9391487797, 9177141712, 9618534720 ,6301890681 ల సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

పార్కు స్థలంలో ప్లాంటేషన్‌కు శ్రీకారం

ఘట్‌కేసర్, జూన్ 12: ఎట్టకేలకు పోచారం మున్సిపాలిటీ యంనంపేట్‌లోని పార్కు స్థలంలో ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల పార్కు స్థలం ఆక్రమణకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తుండటంతో మున్సిపల్ అధికారులు ఇందులో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ యంనంపేట్ రెవెన్యూలోని సర్వేనెంబర్లు 137, 138లలోని శ్రీవేంకటేశ్వర హౌజింగ్ కాలనీలోని 8వేల చదరపు గజాల పార్కులో మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్. కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సుర్వీ రవీందర్, కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, నాయకులు బద్దం జగన్‌మోహన్‌రెడ్డి, నల్లవెల్లి శేఖర్, నర్రి కాశయ్య, అకిటి బాల్‌రెడ్డి, అబ్బవతిని నర్సింహ పాల్గొన్నారు.

జిల్లాలో 10 చెక్‌పోస్టుల ఏర్పాటు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, జూన్ 11: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జంతువుల అక్రమ రవాణాను అరికట్టడానికి 10చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా గోవులు, లేగదూడల అక్రమ రవాణా చేయొద్దన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు, జంతు అక్రమ రవాణాను అరికట్టడానికి జిల్లాలో వికారాబాద్, ధారూరు, మోమిన్‌పేట్, చెంగోముల్, పరిగి, తాండూరు, యాలాల పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో మొత్తం 7అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, బషీరాబాద్, కరణ్‌కోట్, కొడంగల్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో మూడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, మొత్తం జిల్లాలో 10 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధారూరు: బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు ధారూరులో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి మంగళవారం సందర్శించారు. చెక్‌పోస్టులోని రిజిష్టర్‌ను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, జిల్లా డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** ప్రతాప్‌సింగారం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ మండల పరిధి ప్రతాప్‌సింగారంలో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **తాండూరు:** సర్వేనంబర్ 111కు చెందిన విజయ విద్యాలయ పక్కన గల స్థలం ప్రభుత్వనిదేనని ఆర్డీఓ శ్రీనివాస్ రావు స్పష్టం చేశారు. అక్రమణకు గురైన 17 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వు ప్రకారం కొందరు పెన్సింగ్ వేసి బోర్డు పెట్టగా తొలగించి ప్రభుత్వ బోర్డు పెట్టామని చెప్పారు.

● **దోమ:** మోత్కూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రూరల్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం జరిగిన ఫైనల్ పోరులో మోత్కూర్ వర్సెస్ మల్కాపూర్ జట్లు తలపడ్డాయి. పోటీల్లో మల్కాపూర్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు రూ.30వేలు, రన్నర్‌గా నిలిచిన మోత్కూర్ జట్టుకు రూ.15వేలు, ట్రోఫిలను కేఎస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అందించారు.

● **వికారాబాద్:** ఎస్‌బీఐ కార్డుల నందు ఉద్యోగ నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంప్రభుత్వ ఐటీఐ క్యాంపస్ నందు జూన్ 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

● **కీసర రూరల్:** రాంపల్లిలో అక్రమంగా నిర్మిస్తున్న రెండుషెడ్లు, సెల్లార్ భవనం, నాగారంలో షెడ్డును నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ మంగళవారం కూల్చివేయించారు.

● **దోమ:** బాసుపల్లిలో మంగళవారం నిర్వహించిన కురుక్షేత్ర వీధినాటకానికి మాజీ సర్పంచ్ అనంతయ్య హాజరయ్యారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆయనతో రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

● **బొంరాస్‌పేట్:** పూర్యానాయక్ తండాలో మంగళవారం హెచ్‌ఎం రవీందర్‌గౌడ్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు.

● **పూడూరు:** చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచినందున రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ తదిరులు కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● **కొడంగల్ రూరల్:** మిషన్ భగీరథ పథకంపై ఇంటింటి సర్వే నిర్వహించారు. మంగళవారం కొడంగల్ మండలంలోని రుద్రారంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఇంటింటికి వెళ్లి భగీరథ కుళాయి కనెక్షన్ ఉందా లేదా అనే విషయంపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అంకుశాపూర్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (ఇబ్రహీపట్నం)లో చరిత్ర, రాజనీతి శాస్త్రం, భూగోళశాస్త్రం, కంప్యూటర్ సైన్ సబ్జెక్టులలో అధ్యాపకుల ఖాళీలు ఉన్నాయని కళాశాల ప్రిన్సిపల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● **శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్‌లో స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కోరారు.

● **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **శామీర్‌పేట:** మిషన్ భగీరథ మంచి నీటిసరఫరాపై ఎంపీడీవో మమతాబాయి పంచాయతీ కార్యదర్శులతో కలసి సర్వేను ప్రారంభించారు.

● **తాండూరు రూరల్** మండల విద్యాధికారి వెంకటయ్య మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాఠశాలల పునః ప్రారంభంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

● **పూడూరు:** భారీ మెజార్టీతో గెలుపొందిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయత్వంలో భాగంగా నేడు(బుధవారం) పూడూరు మండలంలో ర్యాలీలో పాల్గొననున్నారు. మన్నెగూడ చౌరస్తాలో మండల నాయకులతో కలిసి ఎంపీ ర్యాలీలో పాల్గొంటారని సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ తెలిపారు.

● **పూడూరు:** కంకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా జరిగే కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఇతర ప్రముఖులు పాల్గొంటున్నట్లు ఎంపీడీవో పాండు తెలిపారు.

● **యాలాల:** యాలాల మండల సర్వసభ్య సమావేశం నేడు (బుధవారం) నిర్వహించనున్నట్లు ఎంపీ డీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **ధారూరు:** అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ బుధవారం కేరెల్లి గ్రామానికి విచ్చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కె.విజయబాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపీణీ చేస్తారని తెలిపారు.

క్రైం కార్నర్

60 కిలోల గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతడి వద్ద నుంచి 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రైల్వే సీఐ వెంకటరత్నం తెలిపారు. రైల్వేపోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు స్టేషన్‌లో సాధారణ తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో వారిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్దనున్న ఆరు బ్యాగులను తనిఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఇద్దరిలో ఒకరు పారిపోగా ఒడిస్సాకు చెందిన సంజీత్ కుమార్ భుయాన్‌గా గుర్తించామని చెప్పారు. వారి వద్దనున్న 60కిలోలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిందితుడు గతంలోనూ గంజాయి కేసులో పట్టుబడ్డాడినట్లు రికార్డులో ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రయాణికుడిపై ఆర్టీసీ డ్రైవర్ దాడి


ప్రయాణికుడితో గొడవ పడుతున్న ఆర్టీసీ డ్రైవర్

మేడ్చల్ టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బస్‌ను ఆపకుండా వెళ్తున్న ఆర్టీసీ డ్రైవర్‌ను నిలదీసిన ఓ ప్రయాణికుడిని డ్రైవర్ కర్రతో తలపై బాది గాయాలపాలు చేశాడు. ఈ ఘటన మేడ్చల్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. రామలింగం అనే ప్రయాణికుడు మంగళవారం మేడ్చల్ నుంచి రామాయంపేట వెళ్లడానికి ఆర్టీసీడిపో ఎదురుగా రహదారిపై బస్సుకోసం ఎదురుచూస్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ డిపోకు చెందిన రామాయంపేటకు వెళ్లే బస్ వస్తుండగా చెయ్యి ఎత్తి బస్సును ఆపాలని కోరాడు. అయితే డ్రైవర్ బస్‌ను ఆపకుండా వెళ్లి పోతుంటంతో ప్రయాణికుడు బస్ వెనుకే పరుగులు తీశాడు. దీంతో ప్రయాణికుడు తనను దుర్భాషలాడుతున్నాడని భావించిన డ్రైవర్ బస్‌ను పక్కన ఆపి తన వద్ద ఉన్న కర్రతో ప్రయాణికుడి తలపై బాదాడు. దీంతో ప్రయాణికుడు లింగం పోలీసులను ఆశ్రయించి ఆర్టీసీ డ్రైవర్‌పై ఫిర్యాదు చేశాడు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడ్చల్ టౌన్, జూన్ 11: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను మంగళవారం మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు శివాలయం రోడ్డుపక్కన నిర్మించిన పలు నిర్మాణాలను టీపీవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. దీంతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

యాలాల, జూన్ 11: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు యాలాల ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాలాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(16)తో అదేగ్రామానికి చెందిన సాయిలు(32) అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఈనెల 9వ తేదీన బాలిక తల్లి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వివరించారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై కారు దగ్ధం

మూడుచింతలపల్లి, జూన్ 11: శామీర్‌పేట్ ఔటర్ రింగ్‌రోడ్డుపై ఓకారులో మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి డిచ్‌పల్లికి వెళ్తున్న కారులో ఒక్కసారిగా పొగలు రావడంతో కారులో ఉన్న వ్యక్తులు కారుదిగి బయటకు వచ్చారు. పొగలు తీవ్రమవడంతో మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైంది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

19క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మూడుచింతలపల్లి, జూన్ 11: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పట్టుకున్నట్లు శామీర్‌పేట పోలీసులు తెలిపారు. ప్రజాపంపిణీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తునారని వచ్చిన విశ్వసనీయ సమాచారంతో శామీర్‌పేట్ ఆర్‌ఐ కుమార్, పోలీసులు సంయుక్తంగా బొమ్మరాశిపేట ఓఆర్‌ఆర్‌సర్వీస్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా వెళ్తున్న మహేంద్ర వాహనాన్ని ఆపి పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఆ వాహనంలో 19క్వింటాళ్ల బియ్యం సుమారు 50సంచుల్లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నాగాయిపల్లి తండాకు చెందిన బానోత్ సంతోష్ ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యాన్ని నేరేడ్‌మెట్ పరిసరాల్లో కొనుగులు చేసి మూడుచింతలపల్లి మండలంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఆర్‌ఐ కుమార్ ఫిర్యాదు మేరకుకేసు నమోదు చేసుకుని వాహనాన్ని, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి గోదాంకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నిధుల గోల్‌మాల్ కేసు.. బిల్‌కలెక్టర్ హేమంత్‌కుమార్ రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 11: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో నిధులు గోల్‌మాల్‌కు పాల్పడిన బిల్‌కలెక్టర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి హేమంత్‌కుమార్ ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజు ట్రేడ్ లైసెన్స్, ఇంటి బకాయిలు వసూలుచేసి బ్యాంక్‌ఖాతాలో జమ చేయాలి. కానీ హేమంత్‌కుమార్ 2021 నుంచి 2023 వరకు వసూలు చేసిన ఇంటి బకాయిలు, ట్రేడ్ లైసెన్స్ డబ్బులు మున్సిపాలిటీ బ్యాంక్ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నాడు. ఆగస్టు 2023లో మున్సిపాలిటీకి సంబంధించిన ఆడిట్ జరపగా దాదాపు రూ.3కోట్ల నిధులు బ్యాంక్ ఖాతాలో జమ కాలేదని తేలింది. దీంతో మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు హేమంత్‌కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కోర్టు ఆదేశాల మేరకు నిధుల దుర్వినియోగంపై హేమంత్‌ను అదుపులోకి తీసుకొని మంగళవారం సాయంత్రం రిమాండ్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

శామీర్‌పేట, జూన్ 11: కల్తీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి హెచ్చరించారు. మండలంలోని ఫర్టిలైజర్, విత్తన విక్రయషాపుల్లో, విత్తన కంపెనీల్లో మంగళవారం జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ ఆకస్మిక తనిఖీ చేసింది. షాపుల్లో, కంపెనీల్లో రికార్డులను, విత్తన నిల్వలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐబీ ఇన్‌స్పెక్టర్ జానయ్య, ఏవో రమేష్, విత్తన ధ్రువీకరణ అధికారి మహేష్ పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం నూతన కమిటీ

మేడ్చల్ టౌన్, జూన్ 11: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయం మత్స్యకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.శ్రీకాంత్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా జె.శివకుమార్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఏ.సుధాకర్ ముదిరాజ్‌లతో పాటు కమిటీలో సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దోమ: గుండాలలో మంగళవారం నూతన మత్స్యసహకార సంఘం కమిటీని ఎన్నుకున్నారు. వికారాబాద్ జిల్లా సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎన్నికల అధికారిణి శాలిని సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిని పెద్ద వెంకటయ్య, ఉపాధ్యక్షుడిగా సాతునూరి చిన్న దస్తయ్య, కార్యదర్శిగా కే.మహేశ్, సభ్యులుగా తోగాపూరం నర్సింహులు, సాతులూరి సాయప్ప, కే.అశోక్, బోయిని దస్తయ్య, బోయిని వెంకటయ్య, బోయిని అశోక్ తదితరులను ఎన్నుకున్నారు.

అధిక ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న జిల్లా కేంద్రంలోని, జిల్లా పరిధిలోని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీష్ రావు తెలిపారు. మంగళవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తకాలు డ్రెస్సులు వంటివి అధిక ధరలకు అమ్ముతున్నారని దీనిపై మీరు వెంటనే తగిన చర్యలుతీసుకోవాలని కోరారు. అనుమతులులేని పాఠశాలలపై చర్యలుతీసుకుని మూసి వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేష్, నాయకులు జగదీశ్, రాజేందర్, మురళీ పాల్గొన్నారు.